# మృత్యువులో మొలకలు

"పాపయ్యక్కొత్త సుమారుగా వుందట్రా కోటాయ్" శవాలను శుభ్రపరచే "కోల్డ్‌రూం" లోకి అడుగెడుతూనే అన్నాడు షణ్ముగం.

స్టూడెంట్సువచ్చి ప్రాక్టికల్ కోసమని ఖండ ఖండాలుచేసి వెళ్ళిన శవాన్ని, తిరిగీ చర్మాన్ని దగ్గరగా చేర్చి కుడుతున్న కోటాయ్ చేతిలోని కటింగ్ కర్వ్‌డ్ నీడిల్ (సూది) చప్పున టేబిల్‌మీద పడింది. అప్పుడప్పుడే హాస్పిటల్ బయట ఆవరించుకొంటున్న సంధ్య చీకటిలానే, కోటాయ్ మనసంతా చీకటి ఆవరించుకొందొక్కసారిగా !

* * * * *

"ఎవురు సెప్పారురా సన్ముగం ? చీపుకూడా నిన్న సిస్టరమ్మతో 'ఇక ఎక్కువ రోజులు బతకడీ పాపయ్య' అని సెబుతుంటే సెవులారా ఇన్నాన్నేను ! ఇంతలోకే నక్కనోట్లో మట్టి కొట్టాడంటావురా ?" షణ్ముగంవేపు కొరకొరా చూస్తూ అన్నాడు కోటాయ్ !

అలమారులో నుంచి ఎర్రని రబ్బరు పట్టాతీసి మెడనుంచి మోకాళ్ళవరకూ ప్రేళ్ళాడేలా కట్టుకున్నాడు షణ్ముగం. బేసిన్‌లోనుంచి కత్తి, కత్తెరా తీసుకుని మరో టేబిల్ దగ్గరకు నడిచాడు.

"ధూ....ధూ....ఎంత ఫాక్టికల్ అయితే మాత్రం, ఎంత "డిసెకషన్" అయితే మాత్రం, శవాన్నిట్టా ముక్కలు ముక్కలుచేసి పారెత్తే ఎట్టాగో ! దీన్నో పాటుకుదెచ్చి, అత్తిపంజరంగా మార్చేతలికి దేవుడు దిగొత్తాడని ఆ పిళ్ళోళ్ళకూ తెలీదు! ఆమేట్టర్లకూ తెలీదు !" తనలో తను గొణుక్కుంటున్న షణ్ముగం, తన ప్రశ్నలకు జవాబు చెప్పకుండా దాటేస్తున్నాడని అర్థమయింది కోటాయ్‌కి. పోనీ పాపయ్య పడివున్న

కేన్సరు వార్డువరకూ పోయి వాణ్ణి స్వయంగా చూచివద్దామంటే, ఈ మూల నుంచి ఆ మూలవరకూ ఒక పెద్ద ఊరులా విస్తరించుకుని వున్న హాస్పిటల్ అంతా తిరిగి వచ్చేసరికి చాలా టైము తీసుకుంటుంది. క్షణం తీరికలేదు. తెల్లవారు ఝామునకైనా మూడు శవాల్ని కుట్టెయ్యాలి. మరో దాన్ని శుభ్రంచేసి అస్తిపంజరంగా తయారుచేసి, స్టాండుకు వేలాడ దియ్యాలి. మరో నాలుగు అస్తిపంజరాలని "పేక్" చేసి పంపాలి మెడికల్ కాలేజిలకు! ఈ రాత్రంతా కష్టపడితే అదనంగా పాతిక ముప్పై రూపాయల వరకూ దొరికే ఆశవుంది.

"ఒరేయ్ సన్ముగం! సరిగా సెప్పరా నాయాల! ఇప్పుడు పలుకు తుండడా పాపయ్యా?" ఆదుర్దాగా అడిగాడు కోటాయ్, కేవలం పాపయ్య మీద తనకు సానుభూతి వున్నట్లే, ధ్వనింపజేయాలి కంఠస్వరమని చాలా జాగ్రత్త పడ్డాడు.

"ఆహాఁ! నా వెంపుజూచి నవ్వితే!" షణ్ముగం కోటాయ్ కేసి క్రీగంట చూస్తూ, హుషారుగా కళ్ళెగరేస్తూ అన్నాడు.

కోటాయ్ మనసు మనసులో లేదు. పాపయ్య రేపోమాపో చస్తా డని కొండంత ఆశతో వున్నాడు. వాడు చస్తేగానీ, పాపయ్య "పోస్టు" కోటాయ్‌కి రాదు! పాపయ్య "పోస్టు" కోసం షణ్ముగం కూడా నక్కలా కాచుకుని వున్నాడు. షణ్ముగంగాడు ఛీఫ్‌తో, సిస్టరమ్మలతో, డాక్టర్లతో వాడికా "పోస్టు" ఇప్పించమని తెగ నక్క వినయాలు పడుతున్నాడు. అయితే సర్వీసు కోటాయ్‌కే ఎక్కువ వుంది. పనిలో సులువూ, బలువూ కోటాయ్‌కే బాగా తెలుసునంటారు అందరూ. పాపయ్య అభిమానం కూడా కోటాయ్‌కే ఎక్కువగా వుంది. పాపయ్య చనిపోయాక, వాడి పోస్టు కోటాయ్‌కే వచ్చేలా చేస్తానని చెప్పింది, పెద్ద డాక్టరమ్మ! కానీ, వాడి తాడు తెంచుకుని వాడు మళ్ళీ బతికి కూర్చున్నాడంటే, రోజులు గడిస్తే,

ఎవరి మనసెట్లా మారుతుందో ఎవరు చెప్పగలరు ? షణ్ముగంగాడు ఎవరికేనా "గడ్డి" పెట్టి ఆ "పోస్టు" తన్నుకుపోతాడేమో !

"అబ్బ !" షణ్ముగం కేకతో కోటాయ్ ఆలోచనలు ఎగిరి పోయాయి. "ఏమిట్రా ! ఏమయ్యింది ? చెయ్యి తెగ్గోసుకున్నావా నాయాల ?" అన్నాడు. "నాయాల !" అన్న ఊతపదం పాపయ్య నుంచి సంక్రమించిన "పని నేర్చుకోవటంలోని నేర్పుల"లో ఒకటి !

"ఊహూఁ ! అయిస్ ఓటర్‌లో ఏసిన ఈ టబ్బులోని శవాన్ని బయటేద్దామని సూత్తే, సెయ్యి పూడొచ్చేటంత జిల్లుమన్నాది," నవ్వుతూ అన్నాడు షణ్ముగం. వాడు తన ఆలోచనల తీరును పసిగడుతున్నాడని పించింది కోటాయ్‌కి.

"పాపం పాపయ్య మంచోడురా సన్ముగం ? నేనిట్టాగే మొదట్లో అయిస్ ఓటర్‌లో వున్న శవాన్ని ముట్టుకోవటానికి ఎనకాడుతుంటే నవ్వేవాడు. పాపం ! దేవుడు సల్లగా చూచి బతికితే ...." తర్వాత మాట పూర్తిచేయలేకపోయాడు కోటాయ్ ! ఈ గొంతు తనకే కొత్తగా, అసహజంగా ధ్వనించింది.

"ఊ ! కొంద రాడు సావాలని బగవంతుణ్ణి కోరుతుంటే...." షణ్ముగం ఓరకంట చూస్తూ అన్నాడు. కోటాయ్ తత్తరపడ్డాడు.

"ఛీ.. .ఛీ....ఎవుర్రా ఆళ్లు ? ఆడు మనకేం జేశాడు? ఇంకా పనిలో మెలకువలు నేర్పి బతుకు తెరువు సూపిండు" అంటూండగానే కోటాయ్ మనసు చివుక్కుమంది. అలాటి పాపయ్య చావేనా తను కోరుకొంటోంది? అంతగా బండబారిపోయిందా తన మనసు ? శవాలను కోస్తూ, కుడుతూ, చెక్కి అస్తిపంజరాలను తయారుచేస్తూ తనూ మనసులేని శవంగా మారిపోయాడా ? తనలోనూ అనుభూతులూ, అలోచనలూ, జాలీ, ప్రేమా

అన్నీ నశించిపోయాయా ? అసలు తనిక్కడ నిలదొక్కుకోవటానికి చేయూత నిచ్చింది పాపయ్యకాదూ ? ఆ రోజు.... ఆ రోజు....

కోటాయ్ మనసునిండా గతానికి సంబంధించిన ఆలోచనలు ముసురుకున్నాయి ఒక్కసారిగా. చేతులు యాంత్రికంగా కుడుతున్నాయి. మనసు మరుగుపడిన గతాన్ని, సంఘటనలనీ ఏర్చి, కూర్చి, కలిపి కుట్టడం ప్రారంభించింది.

*     *     *     *     *

"జాగ్రత్తరోయ్ నాయనా, కోటాయ్ ! జేరంగనే కారడు ఏత్తావు గదూ !" ప్లాటుఫారం మీద నిలబడి, నీళ్లు నిండిన కళ్ళతో తల్లి హెచ్చరిస్తుంటే.... ఏడుపు పొంగి వచ్చింది కోటాయ్‌కి. ఎట్లాగో ఆపుకోగలిగాడు.

"అట్టాగేలే ! నువ్వు దిగులుపడమాకే అమ్మా ! మొదటిపాలి జీతం అందుకోంగానే, మామచేత ఈడికి పంపమని సెబుతాను. రాములక్కకి, నారిగాడికి, చిన్నగాడికీ, ఆఖరు చెల్లెలు కాసులుకీ, నీకూ గుడ్డలు తీసుకోయే ! బొత్తుగా పోయాయి !" అన్నాడు మెల్లగా, తల్లి ఒంటిమీదున్న లెక్కలేనన్ని చిరుగుల కేసి చూస్తూ.

"నా తండ్రీ ! ఇక కట్టాలు గట్టెక్కాయంలేరా !" అందామె సంబరపడిపోతూ. ట్రెయిన్ కదిలేందుకు గుర్తుగా గంట కొట్టింది.

"జాగ్రత్తరోయ్ నాయనా, అడ్రసు కాగితం జాగర్త. టికెటు కాగితం జాగర్త.... మొలలో చిల్లర డబ్బుల తిత్తి జాగర్త...." ఇంకా ఏదో చెబుతూనే వుంది. ట్రెయిన్ కదలసాగింది. "అట్టాగేలే !" అంటూ తల బయటకు పెడదామనుకున్నాడుగానీ, ఆ తొక్కిసలాటలో సాధ్యం కాలేదు.

"యాడికెల్లాలిరా ?" పక్కనే కూర్చునివున్న ఆసామీ అడిగాడు.

"బెంగుళూరు !"

"అబ్బో ! ఎవరున్నారక్కడ ?"

" మా మామ, ఆడి కొడుకులూ, కోడల్లూ...."

"సూడ్డానికా !"

"ఊహూఁ ! ఉద్దేగానికి ?" గొప్పగా చెప్పాడు.

"హోరి ! ఏ ఉద్దేగం ?"

"సీపరు పనంట !"

"యాడ ?"

"ఆసుపత్తిరిలో"

"ఏ యాసుపత్తిరి ?"

కోటాయ్ తికమక పడ్డాడు. అసలింతవరకూ బెంగుళూరు ఎప్పుడూ చూశ్లేదు. పుట్టినవూరూ, ఒక్కసారి పుష్కరాలకు బెజవాడ తప్పిస్తే మరేవూరూ చూశ్లేదు ! బెంగుళూరులో ఎన్ని ఆస్పత్రులున్నాయో, అవె క్కడుంటాయో, వాటిలో ఏ ఆస్పత్రిలో తనకు పనో, అసలే తెలీదు !

"ఏమో ! మా మామ సూపిత్తడు !" అనేసి మొహం పక్కకు తిప్పుకున్నాడు. ఊరుదాటి చాలా దూరం వచ్చింది ట్రెయిన్. కోటాయ్ మనసంతా ఏదో గుబులు నిండిందొక్కసారిగా. "జాగర్త, జాగర్త" అంటున్న తల్లి రూపం పదేపదే కళ్ళ ముందు కనిపిస్తోంది. అక్క రాములు, తమ్ముళ్ళు నారిగాడు, చిన్నుగాడు, చెల్లాయి కాసులు, గుర్తు కొచ్చారు వరుసగా. కూటికి జరగక, పస్తులుంటున్న అందరి మొహాలూ,

దీనాతి దీనంగా కనిపిస్తున్నాయి ... "ఈ వయసులో .... బహుశా నాకు .... పద్దెనిమిదేళ్ళుంటా యంటుందమ్మ .... ఇంత చిన్నవయసులో .... నా ఓళ్లెవరూ ఇంత దేశం పోలేదు, అయ్య చచ్చిపోకుండా వుంటే, నేనూ పోకనేపోదును! వున్నట్టుండి జరం తగిలి అయ్య చచ్చిండు! అయ్యుండగా కూటికి లోటులేదు. కానీ అయ్యటు చావడం ఇటు అయ్య పని చేస్తుండే ఆసామీ ఆస్తంతా అమ్ముకుని, సినిమా తీసెయ్యాలని, కాపురం పట్నానికి మార్చి పారెయ్యటంతో, కుటుంబానికి అగచాట్లొచ్చి పడ్డాయి. ఒకపూట కూడుంటే మరోపూట లేదు. ఒకపూట కూలీవుంటే, మరోపూట లేదు. అమ్మ మునుపటిలా కూలి నాలి చెయ్యలేకపోతున్నది. రాములక్క పెద్దదై రెండేళ్ళుదాటింది.అది అయ్య పక్కని పనికి వెళ్లేది.... అయ్య లేకుండా, నా వెంట అదివస్తే, నన్నెవరూ ఖాతరు చెయ్యక పోయిరి! పాలేళ్ళు, ఆసాములూ, ఆళ్ళకొడుకులూ, దానివేపు ఒకరకంగా జూత్తుంటే శానకోపం వస్తూండె! అందుకే దాన్ని పనిలోకి రావొద్ద న్నాను. నారిగాడు,చిన్నిగాడు చిన్నవాళ్ళు. బఱ్ఱెగొడ్లను కాచుకొస్తున్నారు. కాసులుకి మూడేళ్లు.

అన్నీ ఆలోచించి అమ్మ బెంగుళూరులో వున్న మా మామకు కార్డు రాసింది. వారం రోజుల్లో జవాబొచ్చింది. "ఈడికి పంపించు కోటాయ్‌ను. ఈడ ఆసుపత్రిలో నాకు నిండా తెలిసిన మనిషి ఒకడున్నాడు .... కోటాయ్‌కి సీపరుపని ఇప్పించమని సెప్పాను. ఇత్తానన్నాడు. ఎంటనే కుఱ్ఱోణ్ణి పంపించు ... ఫలానా రైల్లో కూచోబెట్టు, ఈడ నేను దింపు కుంటాను" అని.

అయ్యుండగా రెక్కలు ముక్కలు చేసుకుని బాగుచేసిన, కాస్తంత అనాధీనం పొలంలో మిరపదొడ్డి వేసేవాడు. అది ఓ ఆసామీకి ఇచ్చేసి, వందరూపాయలు పుచ్చుకుని, రైలెక్కేశాను !

ఆడ....బెంగుళూరులో రైలుకాడికి మామ రాకపోతే ? తప్పక వస్తానని రాశాడుగా ! రాకుంటే అడ్రసుందిగా. అదెవరికైనా సూపించి, తిన్నగా ఇంటికెళ్ళి మామను సూడొచ్చు.

సీపరు పనంటే ఎట్టాగుంటదో ! రాయవేలూరు ఆసుపత్తిరిలో పనిజేత్తున్న అచ్చిగాడు మొన్నొచ్చాడుగా ! ఎంత దరజాగా వున్నాడు.... "డ్రెస్సు" తొడుక్కుని వచ్చాడు !

"సీపరంటే ఏం జెయ్యాలరా ?" అన్నానో లేదో, గొప్పగా నవ్వేసిండు.

"హోరి ! సీపరంటే....మజా అయిన జాబులేరా !"

"జాబా ?"

"అదే .... ఉద్దేగం. జీతంగాక, పైన చాలా డబ్బులొస్తాయి తెలివుంటే ! డ్రెస్సూ, టోపీ....బలే వుంటుందిలే !" అంటూ ఏదేదో సెప్పాడు. ఆడి ఏసం, బాస, అన్నీ మారిపోయాయి .... నేనూ మారి పోతానా ? మారిపోవాలి ! ఇంటికి డబ్బు పంపాలి. రాములక్క పెళ్ళి సెయ్యాలి. ఉద్దేగం సేసుకొనేవాడికి ఇయ్యాలి రాములక్కని...."

పెద్ద కుదుపుతో రైలు ఆగింది. అందాకా, తనలో తను గొణుక్కుంటున్నట్లు అనుకుంటున్న కోటాయ్, చుట్టూరా చూసి, తన మాట లెవరికేనా వినపడ్డాయేమోనని కంగారుపడ్డాడు....ట్రెయిన్ ఆగింది. ఏదో స్టేషను....

"బెంగుళూరు వచ్చేసినాదా ?" అన్నాడు పక్కనున్నాయనతో.

"ఓర్నీ ! అప్పుడే బెంగుళూరా ! గుంతకల్లే రాలేదు !" అన్నాడు నవ్వుతూ.

ఆ తర్వాత రెండు మూడు స్టేషన్లలో రైలు ఆగినప్పుడు, అదే ప్రశ్న వేయటంతో, ఒకరిద్దరు చికాకుపడుతూ చూశారు.

"ఓ ! ఇంతోటి మొనగాడొస్తున్నాడని బెంగుళూరు ఎదురుగ్గా పరుగెత్తు కొచ్చేస్తాదేమిట్రా ?" అన్నాడొకాయన చివరగా. ఇక మళ్ళీ ఎవర్నీ అడగలేదు.

నిజంగానే, బెంగుళూరులో ట్రెయిన్ ఆగినప్పుడు, గుండె ఆగినంత పనైంది కోటాయ్‌కి. నేల ఈనినట్లు జనప్రవాహం. హడావుడి. "అబ్బ ! పెపంచకంలో ఎంతమంది జనాలున్నారు ?" అనుకున్నాడు కోటాయ్.

"ఎలెల్లాలో....ఏటో" అని తికమకపడిపోయాడు కాస్సేపు.

"ఒరేయ్ ! కోటాయ్ !" అంటూ వచ్చిన మేనమామ పిలుపుతో, స్పర్శతో కోటాయ్‌లో తిరిగి ధైర్యం వచ్చింది.

"పద పద ! బయపడ్డావేందిరా ! నే నొత్తానంటిగా ! అక్క బాగుందా ? పిల్లోళ్ళు ?" తలాడించాడు కోటాయ్.

వారం రోజుల సిటీ బస్సులలో, బెంగుళూరంతా చూపించాడు. లాల్‌బాగ్, సినిమాహాళ్లు, షాపులూ, పెద్ద పెద్ద ఫ్యాక్టరీలూ, దొరలూ, దొరల బంగళాలూ. ఏదో మరో లోకంలోకి అడుగెట్టినట్లయింది. తర్వాత ఒకరోజు, ఆస్పత్రికి తీసికెళ్ళాడు. పెద్ద గేట్లలోనుంచి వెళ్తున్న జనాన్నీ, వస్తున్న జనాన్నీ చూసి, కార్లనూ, రిక్షాలనూ, టాక్సీలనూ చూసి, విస్తుపోయాడు కోటాయ్. "ఇదింకో ఊరా ?" అన్నాడు మామతో.

"ఛ. ఇదేరా ఆస్పతాల్ ! ఈడే నువ్వు ఒర్కు జేయాల్సింది!" అన్నాడు మామ.

"ఒర్కు అంటే ?"

"నీ తలకాయ ! పనిరా! పని. ఈడ బాసేవేరు. నువ్వా నేర్చుకోవాలి. ఈడ ఆసుపత్తిరి అనరు. ఆస్పతాల్ అంటారు" అంటూ వివరించాడు. తర్వాత, పాపయ్య దగ్గరకు తీసికెళ్ళి పరిచయం చేశాడు. "ఈడే నా మేనల్లుడు కోటాయ్! పాపయ్యా ! నీ చేతుల్లో పెడుతున్నాను. ఒర్కులో సులువు, బలువులు నేర్పు. పుట్టిన వూరొదలి ఏనాడూ ఇట్టాంటి బస్తీలు చూసెరగడు. అక్క కుటుంబం కట్టాల్లో వుంది. నువ్వే ఆదుకోవాలి. మొదటి పాలి జీతంలో సగం, మనం అనుకున్న పెకారం నువ్వే వుంచేసుకో.... కుర్రోడికి తెలివుంది.... ఎట్టాగో.... మరి నీ యిట్టం!" అన్నాడు. పాపయ్య సరేనన్నట్లు తలాడించి నవ్వాడు. బుర్ర మీసాలతో ముగ్గుబుట్టలా వున్న పెద్ద తలతో పాపయ్య, సినిమాలో చూచిన యమ ధరమ రాజులా వున్నాడనిపించింది కోటాయ్‌కి.

"పాపయ్య కీడ మంచి పలుకుబడివుంది. పెద్ద పెద్ద డాకటరు బాబులంతా పాపయ్య సలహా తీసుకుంటారు. చీపుకూడా పాపయ్యతో బాగా మాట్టాడతాడు. పాపయ్య చెప్పినట్టు వినుకో. ఉద్దేగం రావడమే గొప్ప! అది నిలుపుకోటం నీ పని! మీ అమ్మ, పిల్లోళ్ళూ అంతా నీ మీదే ఆశలు పెట్టుకున్నారు.... ఏం జేత్తావో! అని మరోసారి హెచ్చరించి వెళ్ళిపోయాడు మామ.

ఆస్పతాల్లో అడుగెట్టి, డూటీలో దిగిన రోజున కోటాయ్ కంతా అయోమయంగా వుంది.

"ఈ సీపరు పోట్టు నీ కెక్కువరోజు లుండదురా కోటాయ్! మా వాడొకడు ఇందులోకి జేరుతాడు. నీకు మరో జాబు చూపెడతాలే" అన్నాడు. ఆ ఇంకో 'జాబు' ఏమిటో కోటాయ్‌కి అర్థంకాలేదు. అసలు పనిలేదు పొమ్మంటాడేమోనని భయపడిపోయాడు. ఆశ నిరాశల మధ్య ఊగిసలాడిపోయాడు.

"ఏ ఒర్కు అయినా సేత్తావటరా కోటాయ్?" అన్నాడు ఆ రోజు పాపయ్య వార్డులన్నీ దాటించి, హాస్పిటల్ ఆవరణలో-దూరంగా, కేటాగా వున్న రూంకేసి నడుస్తూ.

"ఏదైనా సేత్తానండీ!" అన్నాడు.

"అట్టగుండాలి కుర్రోల్లు వుసారుగా! నాయాల! నా కొడుకులూ వున్నారు, ఎందుకూ? చచ్చు శవాలు!"

రూంలో-పగలయినా, పట్టపగలులా పెద్ద పెద్ద లైట్లు వెలుగుతున్నాయి. పెద్ద హాలులాంటి గది. చుట్టూరా తొట్టెలు.... ఆ తొట్టెలలో ఏదో నీళ్ళలో తేలుతున్న శవాలు! ఆ గదిలోనుంచి మరో గదిలోకి దారి. అక్కడెవరో ఇద్దరు కుర్రాళ్లు కత్తులతో, కత్తెరలతో శవాలని చెక్కేస్తున్నారు.

కోటాయ్ గుండె దడదడలాడటం మొదలెట్టిం దొక్కసారిగా.

"ఒరేయ్ రాగా! ఇంకా గది 'కిలీను' సెయ్యలేదంటారా! ఇయ్యాల 'పాక్టికల్' వుందట. టూడెంట్లంతా వొత్తారు. చీపూ ఒత్తాడేమో జాగర్త! శపాల రూమెట్టాగుండాలిరా? నాయాల చీపు వచ్చినా 'శభాష్' అనేట్టుండాలి. టేబుళ్ళన్నీ కిలీనుగా వుంచండి. 'డెట్టాలు ఓటర్'తో తుడిసేసెయ్యి. శపాల రూమూ మరోటా? మనుషుల 'ఒర్డు' కంటే సుబ్బరంగా

వుండాలి” అంటూ రాగడిని కేకలేసాడు. ఆ భాషలో చాలా మాటలు అర్థం కాలేదు కోటాయ్‌కి.

“ఈడే నువ్వు ఒర్కు సెయ్యాల్సింది!” అన్నాడు పాపయ్య హుషారుగా చుట్టూరా ఉన్న టేబిల్స్ వంక, టబ్స్ వంకా చూపిస్తూ; ఏదో నందన వనంలో “ఇది చెట్టు, అది పువ్వు” అని చెబుతున్నంత సహజంగా.

“ఈడా! ఊడవాలా?” అన్నాడు కోటాయ్ భయంగా చూస్తూ.

“ఛస్! దేకుతానన్నావు కాదురా నాయాల! శపాన్ని బడి పిల్లోళ్ళంతా ఒచ్చి, పాఠం నేర్చుకొనేందుకు చిత్తం వచ్చినట్టు కోసిపారెత్తర్రా పిచ్చి నాయాలా! దాన్ని ‘బాస’లో ‘డిసెకసన్’ అంటారు. ఆ ముక్కల ముక్కల శపాన్ని మళ్ళీ కుట్టెయ్యాల. చచ్చిన గొడ్డు తోలు తియ్యటంలే? అట్టాగే! మాంసమంతా చెక్కేసి, జబ్బుతో ఇరిగిన, అరిగిన ఎముకలు-నకిలీ ఎముకలువేసి, సన్నాటి తోలుదారాలతో అతికి, అత్తిపంజరాలు సెయాల్రా! నీకు జీతంగాక, శపానికి ఐదో, పదో గిట్టుతాయిరా! ఇట్లాంటివి నెలకో పది అయితే, నెలకో వొందరూపాయిలు పైగానే కళ్ళజూత్తావు. ఒక్కోసారి బడి పిల్లోళ్లు శపాన్ని కోసేటానికి బయపడి.... పక్కన తోడుండమంటారు....ఆల్లూ ఇత్తారు ఐదో, పదో .... మంచి సంపాద్యం .... నాకు మాత్తరం, నెలకు పాతిక రూపాయలు ఇచ్చుగోవలసిందే నీ వాటాగ్గానూ! ఈడ నీకు జాబిప్పిచ్చినానంటే, అదంతా నా పలుకుబడే! నా మొకమాటమే!” గర్వంగా అన్నాడు పాపయ్య.

కళ్ళు బైర్లు కమ్మినట్లయింది కోటాయ్‌కి.

“మొదటి కేసు సూపిత్తారా! కేసంటే పనిలేరా ఎర్రినాయాల! నే సీడే, నీ పక్కన్నే వుంటాలే! అరజంటు పనిమీద నేనేడకైనా ఎత్తే,

గాబరా పడకుండా పనిలో సులువు బలువులన్నీ సెబుతున్నా ! జాగత్తగా యిను. ఇదుగో, ఈ రబ్బరుపట్టా ఇట్టా కట్టుకో. దీన్ని "ఏప్రిన్" అంటారు బాసలో. ఊ ! ఈ కత్తి, కత్తెర, సూదీ, దారం....అన్నీ తీసుకో. ఇది "కట్టింగు కరువుడు నీడిలు...." సెర్మం కుట్టే సూదన్న మాట. ఇది "రవుండు కరువుడు నీడిలు" పేగులు కుట్టే సూది.... బాస బలే తమాసాగా వుంటదిలే. ముందాటబ్బు.... టబ్బంటే తొట్టె.... లో నుంచి ఆ శవానిట్టా టేబిల్ మీదెయ్యి. సేతులకు కూడా ఆ రబ్బరు గ్లోవుసు తొడుక్కో !" అరచేతుల్లో, అరికాళ్ళలో చెమట పట్టింది కోటాయ్‌కి. టబ్బు దగ్గరికి భయంగా నడచి, ఒణుకుతున్న చేతుల్ని టబ్‌లో పెట్టాడు. శవం చేతికి తగలగానే, నరాలన్నీ ఒక్కసారిగా జిల్లుమన్నట్లనిపించింది.... తన శరీరమూ మంచుముక్కలా కొయ్యబారి పోయినట్లనిపించింది.... విసురుగా వెనక్కు వచ్చి, టేబిల్ మీద తూలి పడ్డాడు కోటాయ్ !

"ఏందిరా ఎధవనాయాలా ! బయపడ్తుండేవా ఏంది ? ఈ మాత్త రానికే ? ఏ పనైనా సేత్తానని డంబాలు సెప్పావ్ ? పిరిగిగొడ్డువని తెలిస్తే, ఈడికి అడుగెట్ట నివ్వను, మీ అమ్మోళ్లు కట్టాల్లో వుండారని, మీ మామ ఆగోరిత్తుంటే, ఈడైతే మంచి రాబడి వుంటాదని, పిల్లోడివి పైకొత్తావని అనుకున్నా ....ఛూ ! ఛూ ... పిరికి నాయాలా !" పాపయ్య విసుక్కుని విసురుగా, టబ్‌లోనుంచి శవాన్ని అవలీలగా ఒక చేత్తో తీసి, టేబిల్ మీద పడేశాడు !

ఒక్కసారిగా కోటాయ్‌లోని భయమంతా ఎగిరిపోయింది. ఉద్దేగం లేకపోతే.... అమ్మ, రాములక్క, నారిగాడు, చిన్నుగాడు, కాసులు.... అల్లంతా తనమీద పెట్టుకున్న ఆశలేం గావాల? ఛీ....ఛీ....తనకు బయం లేదు....కావలసింది బతుకు తెరువు. అంతే ! ఒక్కసారిగా కోటాయ్.... చేతులు విదిలించుకున్నాడు.

"ఊహూఁ! కొత్త. కాలు జారింది మావా! ఆ కత్తీ, కత్తెర, సూదీ, దారం అన్నీ యిట్టాగియ్యి. సెప్పు....ఎట్టా మొదలెట్టాలో....ఏం సెయ్యాలో!" అన్నాడు నిబ్బరంగా. ఆ క్షణంలో, కోటాయ్ కళ్ళకు శవం, శవంలా కనిపించటంలేదు. కొయ్య ముక్కలా, మట్టిబొమ్మలా కనిపిస్తోంది.

పాపయ్యకు వాడి చొరవ నచ్చింది. "అట్టాగే! అద్దదీ! కుర్రోల్లంటే అట్టాగుండాల వుసారుగా! సూపిత్తారా!" అంటూనే దగ్గరుండి నేర్పాడు!

నెల రోజులు తిరిగేసరికి, ఇక పాపయ్య, కోటాయ్ పక్కనుండ నవసరం లేకుండా పోయింది. మొదటి నెల జీతంలో పాపయ్య "జాబు" ఇప్పించి నందుకుగానూ "మెహమాన్" పోను మిగిలింది మామచేత ఇంటికి పంపించాడు....ఏదో తృప్తి, సంతోషమూ కలిగాయి. పాపయ్య తరచూ కోటాయ్ చురుకుదనం చూసి మెచ్చుకుంటున్నాడు. మిగతా కుర్రాళ్ళకు కోటాయ్‌ని ఆదర్శంగా చూపిస్తున్నాడు.

"శవాలలో ఏముందిరా పిచ్చినాయాళ్ళలారా! బయపడి సత్తారు వూరికే! అవేం మనల్ని కరుత్తాయా? మనం సెప్పినట్టింటాయి!" అంటుంటాడు తరచూ.

అవును! శవాలలో ఏముందని తను భయపడాలి? ఏమీ లేదు. తనలోనూ ఏమీలేదు....బతుకు తెరువు ఆలోచన తప్ప! అవి ప్రాణంలేని కట్టెలయితే-తనలాటి వాళ్ళంతా ప్రాణమున్న కట్టెలు. అంతే తేడా! ఇలాటి ధోరణి అలవడింది కోటాయ్‌కి.

పాపయ్య గురువైతే, కోటాయ్ శిష్యుడు. ఒక్కోసారి గురువును మించిన శిష్యుడు.

ఓ రోజు, శవాల గదిలోకి, ప్రాక్టికల్ కోసం మెడికల్ కాలేజి స్టూడెంట్సు చాలామంది వచ్చారు వాళ్ళ ప్రొఫెసర్‌గారి వెంట. శవాన్ని టేబిల్ మీద వుంచి, కుర్చీల్లో చుట్టూరా కూర్చున్నారు. కొందరు నిల్చున్నారు! ప్రొఫెసరుగారు, కాలేయాన్ని గురించిన పాఠం కాబోలు.... శవం పొట్టా, పొత్తి కడుపూ, అంతా, ఓ మూరెడు పొడవున్న ప్లాస్టిక్ బెత్తంలాటి దానితో తట్టి చూపుతూ ఇంగ్లీషులో చెప్పాడు. తర్వాత ఓ కుర్రాణ్ణి పిలిచి "కట్" చేయమన్నాడు. టేబిల్ వరకూ హుందాగా వచ్చిన ఆ కుర్రాడు, టేబిల్ మీది శవాన్ని చూడగానే, ఎంచేతో గడ గడ వణికి పోవడం ప్రారంభించాడు. పళ్ళభీకరానికి, డిసెక్షన్ సామాను తీసుకున్నాడేగానీ, ఆ కంగారులో తప్పుగా దించబోయాడు....

అంతా గమనిస్తున్న కోటాయ్ గబుక్కున టేబిల్ దగ్గరకు వచ్చాడు.

"సార్! సార్! ఇటు.... ఇటు పక్కగా, మెల్లిగా దించండి కత్తి. ఊఁ! కరెట్టు. నా వేపొకమారు సూడండి .... ఈడ .... గుండెకాయ వుంటాది కరెట్టుగా .... ఇవి మూత్ర పిండాలు. "కిడినీ"లని అంటారు మీరు బాసలో .... కదూ?

ఆడ శవానికైతే, ఈడ అండాశయం వుంటాది. అదే గరభ కోశం. మా మోటు బాసలో మేం బిడ్డతిత్తి అంటాంలెండి.

కంగారేం లేదు. అది శవం! మీకేం భయంలేదు....జాగర్తగా గుర్తుగా కత్తిదించి మీక్కావలసిన భాగమేదో మెల్లిగా డిసెకసన్ సేసెయ్యండి...." అనేశాడు. ఆ సమయంలో కోటాయ్‌లో, ఆ స్టూడెంటు ప్రయోగం తప్పు చేస్తాడేమోనన్న ఆలోచనలేదు. బంగారం లాంటి శవాన్ని తప్పుగా కోసేస్తాడేమోనన్న కంగారే నిండివుంది!

ఒక్కసారిగా, స్టూడెంట్సుతోపాటు ప్రొఫెసరు కూడా నిర్ఘాంత పోయాడు. వెంటనే "ఎంత విచిత్రం! రెండేళ్లు, "అనాటమీ" చదివినా, ప్రాక్టికల్స్ చేసినా, మీలో చాలామందికి మానవ శరీరం అంతుబట్టలేదు. కానీ ఈ కుర్రాడు చూడండి....ఆరునెలలు తిరగలేదింకా ఇక్కడికివచ్చి. శవాల్ని కోయటంలో....కుట్టడంలోనే నేర్చుకున్నాడు అన్నీనూ! దేని కైనా మనసుండాలి. ఆసక్తి వుండాలి!" బహుశా, అదే అర్థంగల మాటలు కాబోలు ఇంగ్లీషులో, మెత్త మెత్తగా చీవాట్లువేసే ధోరణిలో అన్నాడు. కోటాయ్ తెలివికి సంతోషించినందుకు గుర్తుగా ఐదు రూపా యలు ఇచ్చాడు. కోటాయ్ నవ్వుకున్నాడు. తర్వాత ఇదంతా తన తెలివి కాదు! శవాల తెలివి! అవి తనకు—మనిషి శరీరంలో ఏయే అవయవం ఏ పరిమాణంలో, ఏ ప్రదేశంలో ఉండేది ఖచ్చితంగా చూపెట్టాయి. కొలతలతోసహా విడమరచి చెప్పాయి....నాడీమండలంలోని ప్రతి చిన్న నరమూ, ఎముకా, వాటికి కత్తిరించటానికీ, కుట్టటానికీ, ఉపయోగించే ఆయుధాల పేర్లూ, అన్నీ నేర్పాయి. మొదటిరోజు, పాపయ్య వెంట వచ్చినపుడు, తను భయపడి పారిపోయివుంటే, బహుశా ఈనాడు, మనిషి శరీరంలో రక్తమూ, మాంసమూ, ఎముకలూగాక మరేదో ఉందనే భ్రమ లోనే తనుండి పోయేవాడు. కానీ ఈ నాడలాకాదు. శవాల పుణ్యమా అని మనిషికీ, శవానికీ మధ్యగల తేడాగా—వుండేది ఒకే ఒక మనసు....అదే ప్రాణం ... అదే జీవం .. అదే వెలుగు .... అదే "ప్రాణవాయువు...." అదే "బుస"....

తనకూ "వేదాంతం" వచ్చేస్తోంది అని నవ్వుకున్నాడు కోటాయ్! పై లాటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. నెల నెలా ఇంటికి డబ్బు దండిగానే పంపుతున్నాడు. అమ్మ, అంతా బాగున్నట్లు కార్డులు రాయిస్తోంది. రాములక్కకు ఇక్కడే ఏదైనా మంచి సంబంధం చూడాలి

అనిపిస్తోంది కోటాయ్‌కి. ఇక్కడైతే నీడపట్టున బ్రతుకుంది. పొలాల్లో వెట్టిచాకిరీ చేయనవసరంలేదు.

రాగడు....అవును, రాగడు, తన లానే హుషారైన కుర్రాడు. తన కంటే, రాములక్కకంటే, రెండు మూడేళ్ళు పెద్దవాడే। నెమ్మదైన వాడు....వాడిక్కడ "జాబు" చేస్తున్నాడు, రాములక్కకూ్కడా ఈ ఆసుపత్రిలోనే "తోటీ'' గా ఏయించేస్తే, ఇద్దరూ దర్జాగా బతుకుతారు....

పనిరద్దీ ఎక్కువగా వున్నపుడు కోటాయ్‌లో వెర్రిఉత్సాహం ఉరకలు వేస్తుంది। పసిపాపల శవాలు మొదలుకోని, శతవృద్ధుల శవాల వరకూ .... టబ్బుల్లో, ప్రయోగాల కోసంవున్న వాటిని చూస్తూ .... పనిచేస్తూ....

"ఎంత చిన్న వయసులో మూత్రపిండాల జబ్బువచ్చి, నూరేళ్లూ నిండించేసుకున్నావురా బుజ్జిగా। అయితే ఏం। ఎందరు కుర్రోళ్ళు, నీ శవంచూచి, ఇట్టాంటి జబ్బులు ఎట్టా నయంచేయాలో నేర్చుకుంటున్నారు చూడు। నీ బతుకే మంచి బతుకు .... నూరేళ్ళు బతక్కుంటే ఏం గాక"।

అమ్మా। తిరిగినంతకాలం సెడుతిరుగుళ్ళు తిరిగావు కామోసు.... బతకలేకో, మరేం కారణమో। ఒళ్లు గుల్ల సేసేసుకున్నావు పాపం। ఊపిరితిత్తులూ సెడిపోయాక .... ఎవరూ నీ మొకం సూళ్లేదు గదూ? అవును. మనుసులకు, మనుసులేమీకారు .. ఈ టబ్బులో నిన్నొక్కన్నైనూ వుంచితే, పేనంలేదు కాబట్టి, వూరుకున్నావు. అదే నీకు పేనంవుండీ, ఈ టబ్బుల్లోనే నీతోబాటు మరో ఆడకూతుర్ని ఏసేశామనుకో। ఇంకే వుందీ। శిగపట్లు పట్టుకుని, ఈ రూమంతా గల్లంతు సేసేయక పోదురా? మిగతా శవాల్ని హాయిగా వుండనిద్దురా।

కడుపులో కాన్సరా తాతా ! దానికి చావుతప్ప మందే లేదంటగా ! పోనీ! ఆ బాధకంటే చచ్చి, 'బతికిపోయావు'! పాతానికి పనికొత్తుండావు!"

అలా మాట్లాడుతూ, నవ్వుతూ, బుజ్జగిస్తూ, పనిచేస్తున్నప్పుడు, వాటిలా నిజంగా జీవం వున్నట్లే, అవి తిరిగి తనకు తమ కథలూ, వ్యథలూ వినిపిస్తున్నట్లే అనుభూతి చెందటం అలవాటైపోయింది కోటాయ్‌కి. అలాంటప్పుడు రాగడు, షణ్ముగం మాత్రం, వాడివేపు ఆశ్చర్యంగానూ, చిరాగ్గానూ చూస్తూంటారు.

కోటాయ్ పనిలో నేర్పులన్నీ నేర్చుకున్నాక, పాపయ్యకు చాలా వరకూ పని తగ్గిపోయింది. పాపయ్య పనికూడా తననెత్తిన్నే వేసుక పని వేస్తుంటాడు కోటాయ్ ! పై పెత్తనం తప్పించి, పాపయ్య కాట్టేపని లేకుండా చేశాడని, పాపయ్యకు కోటాయ్ అంటే తగని అభిమానం, వాత్సల్యం. తనకిక్కడ పనిచూపి, ఎన్నో విషయాలు నేర్చుకోవటానికి అవకాశ మిచ్చాడని, కోటాయ్‌కీ పాపయ్యంటే అపరిమితమైన గౌరవం, భక్తి !

ఈ మధ్య పాపయ్యకు తరచూ కడుపునొప్పిగా వుంటోందంటు న్నాడు. బాధతో మెలికలు దిరిగి పోతున్నా డొక్కొక్కసారి. శవాలలో కాన్సర్ బాగాలు (తీసివేసినవి) తీసివేసి, నకిలీ భాగాలు అమర్చిన కొటాయ్‌కి, అలా పాపయ్య "కడుపునొప్పి" అన్నప్పుడల్లా ఏదో అనుమానం వస్తోంది. "డాకటరు బాబుకు సూపించి, కాస్తంత "రెట్టు" తీసుకోమావాఁ !" చెప్పాడు. పాపయ్యతో.

"సూపిత్తాలేరా కోటాయ్ ! "రెట్టు" కోసరం రెణ్ణాల్లు శలవు పెడదామంటే, నా పనిలోకి నా తర్వాత నా కొడుకు లెవరూ ఎక్కొచ్చేట్టు కనపడదంలా ! అంతా పిరికి నాయాల్లు ! పోనీ ! పని మానుకుని

పోదామా అంటే, మనసొప్పటంలా ! డబ్బు చేదా ? డబ్బట్టాగుంచు ! ఒరేయ్ కోటాయ్ ! నువ్వొచ్చినట్టే, నీ ఒయసులోనే, నేనీ ఆస్పత్తాల్లో అడుగుపెట్టానురా ! ఈ శవాల గదిలో కాలుపెట్టానురా ! ఆ చనం నుంచీ ఈ చనం వరకూ, ఈ గదే నా "వైకుంఠం". ఈ శవాలే నా దేవుల్లు ! ఇయ్యే నాకు కూడూ, గుడ్డా, నీడా నా కుటుంబానికో దారి సూపిన దేవొతలు ! ఈటి ఆపున్నే, నేనింతటోన్నయ్యాను. ఆస్పత్తాల్లో సిన్నా పెద్దా డాకటరు బాబులంతా నన్ను గౌరవంగా సూత్తారు ! నా బిడ్డలూ లచ్చనంగా బతుకుతుండారు.

అందుకే ఈటి నొదిలి పోబుద్ది గావటంలేదు ! నా మిగిలిన కొత్తంత బతుకూ ఈటి మద్దెనే గడిసిపోవాల ! పానం పోతుందని, చనం ముందు తెలిసినా ఈటి పక్కనే ఆ టబ్బులో పడుకుని, పానం యిడిసేస్తాను !" అన్నాడు నవ్వుతూ. ఆ మాటలలో, శవాలతో వాడికిగల అనుబంధం, ఆత్మీయత, ఆవేశం, ఆనందం, బాధ, అన్నీ కలగాపులగంగా నిండి వున్నాయని తెలిసిపోయింది కోటాయ్‌కి.

కోటాయ్ జాలిగా చూశాడు. "పాపయ్య మామా ! నీ సార్వీసు అయిపోయినా, నీ "పోట్టు"లో ఎవుడొత్తాడో ఏమో ! కొత్తోల్లకు నీలా పనిలో సులువుబలువులు మెల్లగా సెప్పి సేయించెవోడూ, సెప్పేవోడూ ఎవడూ లేడని పిత్తోంది నాకు !" అన్నాడు మృదువుగా.

పాపయ్య నవ్వాడు. "నా పోట్టే" కాళీ అయితే, ఇంకెవుణ్ణీ రానీనురా ! నా యంతటోడివి నువ్వే ! నిన్నే ఏపించేత్తా నా పోట్టులో ! "చీపు" దొరకూ్కడా సెప్పాను శానామాట్లు ! ఆ దొరకూడా అదే మాటన్నాడు. సన్ముగంగాడు ఎగబడ్తుండాడుగానీ, ఆడికి నీలాగా చురుకుదనం, కరుకుదనం, పనిలో వయినం, వొందనంలేవు !" అంటూనే మళ్ళీ నొప్పివచ్చి బాధతో గిలగిలలాడి పోయాడు మాట మధ్యలోనే !

ఒక్కసారిగా కోటాయ్‌లో సంతోషమూ, ఆశా, ఉప్పొంగాయి! పాపయ్య తర్వాత ఆ "పోట్టు" తనది! పాపయ్య తర్వాత.... ఆ మాటే మనసు పొరల్లో మెలికలు పడ్డది....

కానీ బతికుండగా పాపయ్య ఈ "వైకుంఠం" వదలిపోడు. పోలేడు! పాపయ్య చచ్చిపోతే.... టబ్బులో పడితే....

అంతరాంతరాలలో, పాపయ్య ఎక్కువకాలం బతక కూడదన్న కోరికా, గురువులాటి పాపయ్య చావు తను కోరకూడదన్న మందలింపూ, ఒకటి తర్వాత ఒకటిగా, తెరలు తెరలుగా వస్తున్నాయి కోటాయ్‌కి!

కొత్త శవాన్ని టబ్‌లో ద్రావకమూ, ఐస్‌వాటర్‌లో వేసి తిరిగి చూచిన కోటాయ్, కాస్తంత దూరంలో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న పాపయ్య వెర్రికేక పెట్టి విరుచుకుపడటం కనిపించింది! ఇక క్షణం ఆలస్యం చెయ్యకుండా డాక్టర్ల దగ్గరకు పరిగెత్తాడు. వాళ్ళంతా పరీక్షలు చేసి, పాపయ్యకు చెప్పలేదుగాని, కోటాయ్‌తో చెప్పారు. ఇక పాపయ్య అట్టేకాలం బతకడని! నెలరోజులుగా పడకమీదే వున్నాడు పాపయ్య—రేడియం కిరణాల ట్రీట్‌మెంటు కూడా వృధా అయిపోయింది.

"నా శవాన్ని ఈడనే ఉంచండి! నా ఓల్ల కివ్వొద్దు!" అని చెప్పేశాడుట పాపయ్య! బాధ తెలియకుండా వుండేందుకు మత్తుమందు లిస్తున్నారు.

షణ్ముగం ఎత్తులు వేస్తున్నాడు. వాళ్ళనూ, వీళ్ళనూ మంచి చేసుకుంటున్నాడు....పాపయ్య ''పోట్టు'' తను గెల్చుకోవాలని, తంటాలు పడుతున్నాడు. కోటాయ్ కదే బాధ! ఇంత చేసి షణ్ముగం తన్నుకపోతాడేమో!

ప్రతిరోజూ పాపయ్య వున్న కాన్సర్ వార్డ్ దగ్గరకు వెళ్ళి పాపయ్యను పలకరించి, చూచి వస్తున్నాడు కోటాయ్ ! మత్తుగా వుంటే వూరికే చూచి ఇవతలికి వస్తాడు, లేకపోతే "ఎట్టాగుంది మావా? కాస్తంత నెమ్మదిగా వుందా?" అంటాడు. ఆ ప్రశ్నలో "ఎప్పుడు చస్తావు నువ్వు?" అన్న మరో ప్రశ్న అంతర్గతంగా దాగివున్నట్టు కోటాయ్ మనసుకే తోస్తోంది .... తప్పు అనుకుంటాడేగాని, తప్పించుకోలేక పోతున్నాడు. పోటీ అట్లాంటిది. బతుకు తెరువు అట్లాంటిది.

పాపయ్య మాత్రం, నిశ్చలంగా మత్తుగా నవ్వేస్తాడు. "ఏందోరా ! నాకేదీ తెలియటం లేదురా నాయాలా, ఒరేయ్ కోటాయ్ ! ఆ రోజు.... నే నీడ కొచ్చే రోజు ...టబ్బులో వేసిన శవం....జాగర్తరోయ్ ! భేసైన శవం .... ఎన్నో పయోగాలకు పనికొస్త దది !" ముద్ద మాటలు !

పాపయ్య తొరగా చస్తే, ఆపోట్టు తనకు వచ్చేస్తే రాములక్కకూ, రాగడికీ పెళ్ళి సేసెయ్యాలి ! నారి గాడికీ, చిన్నగాడికి కూడా, ఈ అస్పతాల్‌లోనే చిన్న చిన్న ఉద్దేగాలు.... బెడ్డు పానులూ, చిన్న చిన్న టూబులూ కడగటం — బాతురూములు ఊడవటం....లాటివి సూడాలి ! పాపయ్యలా తనూ పలుకుబడి సంపాదించుకోవాలి, పదుగురికీ నోట్లో నాలికలా కావాలి....తను పది మందికి పని సూపించే "మంచి కోటాయ్"గా పేరు తెచ్చుకోవాలి. కానీ, ఇవన్నీ పాపయ్య చావుమీద ఆధారపడి వున్న పనులు ! వీడి దుంపదెగి....వీడు బతికిపోతే....

* * * *

ఒక్కసారిగా సూది వేలిలోకి దిగబడి, వేలు రక్తం చిమ్మింది ! కోటాయ్‌కి ఆలోచనల మత్తు వదిలిపోయింది. గతం మాయమై వర్తమానం బయటపడింది, బాగు చేయబడిన అస్తిపంజరంలా ! ఆలోచిస్తూనే తనిందాకా, మూడు శవాల్ని కుట్టేశాడు. అస్తిపంజరం తయారై పోయింది.

కోటాయ్ ! కోటాయ్ ! సన్ముగం ! పాపయ్య చచ్చిపోయాడు రోయ్ ! ఖాయంగా సచ్చిందని డాకటరు బాబే సెప్పేసిండు." రాగడు అరుస్తూ కబురు తెచ్చాడు ! రాగడి కేసి నిదానంగా చూస్తూ అన్నాడు కోటాయ్ ! ''నిజంగానట్రా రాగా ?'' ఆ ప్రశ్నలో ఏదో సంతోషం, కొద్ది బాధ కలిసి వున్నాయి !

''ఊ ! ఆడినించే నే రావటం ! స్టెచరు పట్టుకొత్తున్నారు, ఓర్డు బాయిలు ! ఆ ఖాళీగా వున్న టబ్బులో వేసెయ్యమని సెప్పిండు చీపు ! బడిపిల్లోల్ల కోసం కావాలంట ఆడి శవం. అన్నట్టు పాపయ్య ''పోట్టు'' నీకే కాయం చేసేశాడంట చీపు ! పెద్ద డాకటరమ్మ సెప్పిందిలే ! అన్నాడు రాగడు హడావుడి పడుతూ. షణ్ముగం చిరాకు పడుతూ ఏదో పని వున్నట్టు బయటకు వెళ్లాడు.

సన్ముగం గాడి వుక్రోసం సూడు కోటాయ్ ! పాపయ్య పోట్టు నీ కొత్తుండాదని ఏడుపు వీడికి !'' అన్నాడు మళ్ళీ రాగడు నవ్వుతూ ! రాగడికి కోటాయ్ అంటే గౌరవం భక్తి !

కోటాయ్ నిశ్చలంగా నిల్చున్నాడు క్షణ కాలం. పైమీది రబ్బరు పట్టి విప్పి స్టాండుకు తగిలించాడు. ఆ స్తిపంజరాన్ని ద్రావకంలో వేశాడు, ''క్లీన్'' కావటానికి. టేబిల్ మీద చెల్లా చెదురుగా పడివున్న మాంసం ముక్కలూ, చర్మం ముక్కలూ, దారాలూ, చిన్న చిన్న నరాలూ బక్కెట్లోకి విసిరేసి టేబిల్ క్లీన్ చేశాడు. కత్తులూ, కత్తెరలూ, సూదులూ, దారాలూ, అన్నీ అల్మారాలో బేసిన్‌లో వేశాడు. దూరంగా హాస్పిటల్ ఆవరణ. గోడవతల....తూర్పు దిక్కున తొలి వెలుగు రేఖలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి....ఈ క్షణంలో కోటాయ్‌కి అలసటగా వుంది, ఆనందంగా ఉంది, బాధగా వుంది; వీటన్నిటికీ అతీతమైనంతటి నిశ్చలంగానూ వుంది!

"పాపయ్య 'పోట్టు' నీ కొచ్చేసినాది ! మరి నీ పోట్టులో నన్నే సుకో కోటాయ్ ! నా తమ్ముడొకడున్నాడు ! ఆడికీ ఈడ ఏదేనా పని ప్పించు కోటాయ్ ! ఆడికి శవాలంటే భయం, గియం ఏమీ లేదు ! నీ పేరు జెప్పుకుని బతుకుతాం !" అంటున్నాడు రాగడు రూమంతా కలయ దిరుగుతూ ! కోటాయ్ మాటాడలేదు. మౌనంగా గదంతా కలయ జూస్తున్నాడు. ఎలక్ట్రిక్ లైటు వెలుగు గదంతా పరచుకుని వుంది. బయటి వెలుగు పాకివస్తోంది.... టేబిల్స్, టబ్బులు, శవాలు,....అస్తిపంజరాలు.... మృత్యు శీతలచ్ఛాయ, మృత్యువు, మృత్యు గహ్వారం.... అక్కడే వాడి బ్రతుకు ప్రారంభమైంది. పెరిగింది. మహావృక్షమైంది.

రాగడు మరో మొలక.... నారిగాడు.... చిన్నిగాడు .... అంతా అక్కడే నాటవలసిన మొక్కలు.... అవి చిగురించాలి.... పెరగాలి....

కోటాయ్ అలా చాలసేపు నిల్చుండి పోయాడు.

"నేను మొలకగా ఈడికివచ్చాను ! మానై పోయాను. నా కింద ఎందరో బతుకుతామంటే నా కేటి నట్టం ? అందరూ నాలాంటోళ్ళే." అనుకుంటున్నాడు నిండుగా !

"అట్టాగే సూత్తాలే రాగాయ్. ఇయ్యాల పగలు డ్యూటీ నీది ! నే వెళ్ళి పడుకుంటానింక.... కునుకు తీసి లేత్తేగాని పానం బాగుండేలా లేదు !" అంటూ రూం బయటికి నడిచాడు కోటాయ్ !

తెల్లగా తెల్లవారింది ! హాస్పిటల్ ఆవరణలో వున్న మర్రిచెట్టు ఊడ ఒకటి, అప్పుడే మెల్లిగా నేలకు తాకింది !

("తరుణ" ఆగస్ట్ 1974)